
సాక్షి
రంగారెడ్డి
శనివారం, 13, సెప్టెంబర్, 2025



బీహార్ ఎన్నికల కోసమే..
బీహార్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం జీఎస్టీ తగ్గించిందని మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి విమర్శించారు. 8లో▸



పెట్రోల్‌లో నీళ్లు..
పెట్రోల్‌తో పాటు నీళ్లు రావడంతో ఓ కారు మొరాయించి ఇంజన్ పాడైంది. దీంతో వాగ్వాదం చోటుచేసుకుంది. 8లో▸



మూసీలోకి పోటెత్తిన వరద
మూసీ నదిలో భారీగా వరద ప్రవాహం పెరిగింది. జంట జలాశయాల గేట్లు ఎత్తి దిగువకు నీళ్లు విడుదల చేస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

విద్యాభివృద్ధికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన సభ్యులు

షాద్‌నగర్: చదువునే అభివృద్ధి సాధ్యమని ఆర్యవైశ్య ఆఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ అన్నారు. ఆవోపా జిల్లా రూరల్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని శుక్రవారం పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యం కోసం ఆవోపా ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. పేద విద్యార్థులను విద్యలో ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా రూరల్ నూతన అధ్యక్షుడిగా తాటి రామచంద్రుడు, ప్రధాన కార్యదర్శిగా బాల రాజేష్, కోశాధికారిగా వెంకటరమణ, అడిషనల్ సెక్రటరీగా సురేష్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా భీంసెట్టి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పెండ్యాల నీరజ, ప్రధాన కార్యదర్శిగా సుమలత, కోశాధికారిగా సురేఖ, అదనపు ప్రధాన కార్యదర్శిగా దండు శిరీష, కార్యనిర్వాహక కార్యదర్శిగా కవిత ప్రమాణ స్వీకారం చేశారు.

గ్రామాలతోనే దేశ పురోగతి



నక్కలపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని, ఇందుకోసం కేంద్రం ఎంతో కృషి చేస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి, చాకలిగూడలో ఎంపీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చనివెల్లి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు నీలకంఠం, బాకారం శ్రీనివాస్‌గౌడ్, బంటు జ్ఞానేశ్వర్, భీమేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి విధ్వంసం ప్రజలపై యుద్ధమే



బహుజన బతుకమ్మ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మొయినాబాద్: ప్రకృతిని విధ్వంసం చేయడమంటే ప్రజలపై యుద్ధం చేయడమేనని రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని చిలుకూరులో బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విధ్వంసాన్ని అడ్డుకుని శాంతి స్వావలంబన కోసం ఈ నెల 20 నుంచి అక్టోబర్ 3 వరకు బహుజన బతుకమ్మ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 22న చిలుకూరులో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అరుణోదయ సంఘం విమలక్క బృందం హాజరవుతుందన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి, నాయకులు జకరయ్య, మోహన్, కుమార్, ఈశ్వరయ్య, రాము, ప్రభాకర్, యాదయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

అదనపు వసూళ్లపై ఫిర్యాదు చేయండి



ఇబ్రహీంపట్నం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓ ఫ్లెక్సీ అందరినీ ఆకర్షిస్తోంది. రిజిస్ట్రేషన్ చార్జీలు తప్ప ఎవరైనా అదనంగా వసులు చేస్తే తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని అందులో పొందుపర్చారు. దీనిపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.
– ఇబ్రహీంపట్నం

భూములున్నాయ్.. కొంటారా?



ఈ నెల 17 నుంచి హెచ్‌ఎండీఏ స్థలాలకు ఆన్‌లైన్ బిడ్డింగ్
- ప్రీబిడ్ సమావేశాల్లో కొనుగోలు దారుల నుంచి స్పందన శూన్యం
- తుర్కయంజాల్, బాచుపల్లిలో విక్రయాలకు సన్నాహాలు
- తుర్కయంజాల్‌లో 12, బాచుపల్లిలో 70 ప్లాట్లు సిద్ధం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఇంచుమించు రెండేళ్ల విరామం తరువాత భూములను వేలం వేసేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) రంగం సిద్ధం చేసింది. నగరంలోని తుర్కయంజాల్, బాచుపల్లిల్లో ఉన్న ప్లాట్‌లను ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించేందుకు సన్నాహాలు చేపట్టింది. ఈ రెండు చోట్ల నిర్వహించిన ప్రీబిడ్డింగ్ సమావేశంలో కొనుగోలుదార్ల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లభించలేదు. సాధారణంగా హెచ్‌ఎండీఏ స్థలాల కోసం ఏర్పాటు చేసే ప్రీబిడ్ సమావేశాల్లోనే కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆసక్తులను వ్యక్తం చేస్తారు. సందేహాలను నివృత్తి చేసుకుంటారు. కానీ.. ఈ నెల 2, 3 తేదీల్లో నిర్వహించిన ప్రీబిడ్ సమావేశాల్లో అలాంటి ఆసక్తి కనిపించలేదు. అతి తక్కువ సంఖ్యలో కొనుగోలుదారులు పాల్గొన్నట్లు అధికారులు చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో నిర్వహించే ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు ఏ మేరకు స్పందన ఉంటుందనేది సందేహాస్పదంగా మారింది. బిడ్డింగ్ నిర్వహణ కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థలాలపై విస్తృత ప్రచారం కూడా చేపట్టారు. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో నెలకొన్న స్తబ్ధత దృష్ట్యా అధికారుల్లోనూ డైలమా నెలకొంది,

ధరలు ఎక్కువే...

రెండు చోట్ల హెచ్‌ఎండీఏ నిర్ణయించిన బేసిక్ ధరలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తుర్కయంజాల్‌లో చదరపు గజానికి రూ.65,000, బాచుపల్లిలో రూ.70,000 చొప్పున ధర నిర్ణయించారు. ప్రస్తుత స్తబ్ధత కారణంగా మార్కెట్ ధరల కంటే ఎక్కువే ఉన్నట్లు కొనుగోలుదారులు అభిప్రాయపడుతున్నారు. 'తుర్కయంజాల్‌లో ప్రస్తుతం గజానికి రూ.40,000 నుంచి రూ.45,000 వరకు ఉంది. కానీ హెచ్‌ఎండీఏ రూ.65,000 వరకు పెంచింది. దీంతో కొనుగోలు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపించకపోవచ్చు' అని తుర్కయంజాల్‌కు చెందిన రియల్టర్ ఒకరు చెప్పారు. ఇక్కడ మొత్తం 12 ప్లాట్‌లను విక్రయించేందుకు నోటిఫికేషన్ వెలువరించారు. ఒక్కో ప్లాట్ కనిష్టంగా 600 గజాల నుంచి 1,146 గజాల వరకు ఉంది. ప్లాట్ సైజులు నాలుగు వైపులా సమంగా లేకపోవడంపై కూడా పలువురు పెదవి విరుస్తున్నారు. కొన్ని స్థలాలకు క్రాసింగ్‌లు ఎక్కువగా ఉన్నాయి. దీంతో భవన నిర్మాణాలకు అనుకూలంగా ఉండకపోవచ్చని మరికొందరు పేర్కొంటున్నారు. తుర్కయంజాల్‌లోని ప్లాట్‌లకు ఈ నెల 17న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించనున్నారు. కొనుగోలుదారులు 16వ తేదీ సాయంత్రం వరకు రూ.1,180 చెల్లించి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు.

బాచుపల్లికి స్పందన కరువే..

బాచుపల్లిలో ఉన్న 70 ప్లాట్‌లకు ఈ నెల 18న ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు దఫాలుగా వేలం నిర్వహించనున్నారు. ఉదయం 35 ప్లాట్‌లు, మధ్యాహ్నం 35 ప్లాట్‌లకు బిడ్డింగ్ ఉంటుంది. ఈ నెల 17వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ సదుపాయం ఉంది. ఈ స్థలాల కోసం నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లోనూ 30 మంది లోపే కొనుగోలుదారులు తమ ఆసక్తిని చూపడం గమనార్హం. ఈ స్థలాలకు గజానికి రూ.70,000 చొప్పున ధర నిర్ణయించారు. స్థానికంగా ఉన్న మార్కెట్ ధరల కంటే ఎక్కువేననే అభిప్రాయం ఉంది. చాలా వరకు మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసేందుకు అనుకూలంగా ఉన్నాయి. కనిష్ఠంగా 266.67 గజాల నుంచి గరిష్ఠంగా 499.96 గజాల వరకు ఈ ప్లాట్ సైజ్‌లు ఉన్నాయి. ఈ లే అవుట్‌కు అప్రోచ్ రోడ్ లేకపోవడం కూడా ఒక లోపంగా ఉన్నట్లు ప్రీబిడ్డింగ్‌లో పాల్గొన్న కొందరు చెప్పారు. మరోవైపు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని పలు చోట్ల మిగిలిపోయిన హెచ్‌ఎండీఏ స్థలాలకు ఈ నెల 19న బిడ్డింగ్ నిర్వహించనున్నారు.

ఒకప్పుడు హాట్‌కేకుల్లా..

హెచ్‌ఎండీఏ ప్లాట్‌లు ఒకప్పుడు హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. కోకాపేట్‌లో ఎకరం రూ.కోటికిపైగా అమ్ముడు కాగా, మోకిలాలో గజానికి రూ.లక్షకుపైగా ధర పలికింది. బుద్వేల్‌లోనూ అనూహ్యమైన స్పందన లభించింది. ఉప్పల్ భగాయత్, బోడుప్పల్, మేడిపల్లి, హయత్‌నగర్, బాచుపల్లి, తుర్కయంజాల్, తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున అమ్ముడయ్యాయి. భూముల అమ్మకాలపైన ప్రభుత్వానికి రూ.వేల కోట్ల ఆదాయం లభించింది. అన్ని మౌలిక సదుపాయాలతో లే అవుట్‌లను రూపొందించడం, ఎలాంటి వివాదాలు లేకపోవడం, బ్యాంకుల నుంచి సత్వరమే రుణసదుపాయం లభించడం వంటి వివిధ కారణాల దృష్ట్యా కొనుగోలుదారులు ఆసక్తి చూపారు. ఇప్పటికీ హెచ్‌ఎండీఏ స్థలాలపైన ప్రజల్లో నమ్మకం ఉన్నప్పటికీ ప్రస్తుత మార్కెట్ స్తబ్ధత, అధికధరలు, అడ్డదిడ్డంగా ఉన్న ప్లాట్ సైజులు, రోడ్డు సదుపాయం లేకపోవడం వంటి అంశాలు బిడ్డింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

హేయమైన చర్య



సాక్షి పత్రిక, జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని హేయమైన చర్యగా వివిధ సంఘాల నేతలు అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైఖరి సరికాదని, పత్రికా స్వేచ్ఛను హరించొద్దని అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాల పేరుతో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు.

అక్రమ కేసులు సరికాదు



ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వం తప్పులను ఎత్తిచూపుతున్న సాక్షి పత్రిక, జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేయడం హేయమైన చర్య. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా జర్నలిస్టులు ఉంటారు. సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు పెట్టడం అన్యాయం. ప్రభుత్వ వ్యతిరేక వార్తలు ప్రచురితమైతే సంబంధిత శాఖ అధికారులు ఖండించొచ్చు లేదంటే పరువు నష్టం దావా వేసుకునే వీలు చట్టంలో ఉంది. అక్రమ కేసులు బనాయించడం, దాడులకు తెగబడడం అవివేకం.
– ఎం.డి.నసీర్ పాషా, హైకోర్టు న్యాయవాది, మహేశ్వరం

జర్నలిస్టుల గొంతు నొక్కొద్దు



సాక్షి దినపత్రికపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండ సరికాదు. రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛను హరించే విధంగా అక్కడి ప్రభుత్వ చర్యలు ఉన్నాయి. జర్నలిస్టుల ఇళ్లలో తనిఖీల పేరుతో భయభ్రాంతులకు గురి చేయడం సరి కాదు. ప్రజల పక్షాన పనిచేసే జర్నలిస్టుల గొంతు నొక్కడం సరి కాదు.
– లక్ష్మణ్‌కుమార్, యువసత్తా యూత్ అధ్యక్షుడు, షాద్‌నగర్

హక్కులకు భంగం కలిగించొద్దు



ప్రజాస్వామ్య దేశంలో ప్రతికలపై దాడి చేయడం ఏమాత్రం సరి కాదు. పత్రికా స్వేచ్ఛను కాపాడే బాధ్యత తీసుకోవాల్సిన ప్రభుత్వాలు పాత్రికేయులపైనే కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. పత్రికా స్వేచ్ఛకు, జర్నలిస్టుల హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరించడం తగదు.
– నర్సింలు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

పత్రికా స్వేచ్ఛను హరించడమే..



జర్నలిస్టులు ఎక్కడైనా ప్రతిపక్ష పాత్ర పోషించాల్సి ఉంటుంది. ఏపీ లో ప్రశ్నిస్తున్న జర్నలిస్టులపై దాడులు, కేసులు నమోదు చేయడం వంటివి పత్రికా స్వేచ్ఛను హరించడమే. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చిన హామీలు గెలిచిన తర్వాత నెరవేర్చకుంటే కచ్చితంగా జర్నలిస్టులు ప్రజల తరపున ప్రశ్నించడం సహజం. జర్నలిస్టుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాల పేరుతో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు.
– చందోజీ, సామాజిక కార్యకర్త, కడ్తాల్

రాజ్యాంగానికి విరుద్ధం



పత్రికా స్వేచ్ఛపై దాడిచేయడం రాజ్యాంగానికి విరుద్ధం. పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. పత్రికారంగాన్ని రాజకీయ కోణంలో చూడటం తగదు. ఉద్దేశ పూర్వకంగా మీడియాపై కేసులు పెట్టడం సరి కాదు. మీడియాలో పాలకపక్షం వార్తలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఆరోపణలు వార్తల రూపంలో వస్తాయి. తప్పుడు వార్తలు వస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలి.
– రాఘవేందర్‌గౌడ్, టీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ అధ్యక్షుడు, షాద్‌నగర్

వాస్తవాలను దాచలేరు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మీడియా స్వేచ్ఛను కాలరాస్తోంది. జర్నలిస్టుల గొంతు నొక్కడమంటే ప్రజా హక్కులను హరించడమే. నిర్బంధాలు, దాడులతో వాస్తవాలను దాచలేరు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. ఏపీ కూటమి ప్రభుత్వ చర్యలను సమాజం హర్షించదు. – వై.గీత, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి

కార్మిక చట్టాలను కాలరాయడం తగదు

కందుకూరు: దేశంలో నరేంద్రమోదీ పాలనలో కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి హక్కులను కాలరాస్తున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్, సీఐటీయూ మండల కన్వీనర్ బుడ్డీరపు శ్రీనివాస్ విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆశ వర్కర్ల మండల మహాసభను ఆ సంఘం సీనియర్ నాయకురాలు సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికుల హక్కులు, సమస్యలపై నిరంతరం పోరాడుతుంటే కేంద్ర ప్రభుత్వం అనేక నిర్బంధాలు విధిస్తోందని విమర్శించారు. ఆశ వర్కర్లు 20 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా కనీస వేతన చట్టం అమలు చేయకుండా వారితో వెట్టి చాకిరీ చేయిస్తున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, అర్హత గల వారికి ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆశ వర్కర్ల సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దేశానికి కీర్తిప్రతిష్టలు తేవాలి

జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ సుబ్రమణియన్



మాట్లాడుతున్న జస్టిస్ సుబ్రమణియన్

శంకర్‌పల్లి: బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి, దేశానికి పేరు ప్రతిష్టలు తేవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ వి.సుబ్రమణియన్ అన్నారు. దొంతన్‌పల్లిలోని ఇక్ఫాయ్ డీమ్డ్ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ కోర్సుల్లో డిగ్రీలు పొందిన 3,947 మందికి పట్టాలు అందజేశారు. మాజీ అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా కేశవపరాశన్, సున్నా బడ్జెట్‌తో వ్యవసాయం చేస్తున్న పద్మశ్రీ సుభాష్ పాలేకర్, హెచ్‌డీఎఫ్‌సీ మాజీ చైర్మన్ దీపక్ పరేఖ్‌కు యూనివర్సిటీ తరఫున గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ వి.సుబ్రమణియన్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ చిన్నతనం నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. జీవితంలో పైకి ఎదగడంతో పాటు వ్యక్తిత్వాన్ని సైతం సమస్థాయిలో పెంపొందించుకోవాలన్నారు. కళాశాల చాన్స్‌లర్, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సి.రంగరాజన్ మాట్లాడుతూ.. భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని, దీనికి ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేస్తూ, దేశానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చాన్సలర్ కోటిరెడ్డి, రిజిస్ట్రార్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో గణనీయమైన మార్పులు

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థుల భవిష్యత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో ముడిపడి ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి, గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కృత్రిమ మేధపై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాలకిష్టారెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. రానున్న రోజుల్లో సమాజంలో ఏఐతో గణనీయమైన మార్పులు వస్తాయని అన్నారు. కృత్రిమ మేధపై విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. గురుకులాల రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ నాగార్జునరావు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని నిరూపించుకోవడానికి ఇలాంటి సదస్సులు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం వీసీ జీఎన్ శ్రీనివాసన్ మాట్లాడుతూ.. విద్యావిధానంలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన డిగ్రీ గురుకులాల డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ వేణుగోపాల్‌రావు, గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, గిరిజన గురుకుల డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రైవేట్ పరిశ్రమల సౌజన్యంతో నిర్వహిస్తున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా కంపెనీ సౌజన్యంతో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జీఎన్ శ్రీనివాసన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, ఫార్మాకంపెనీ ప్రతినిధి ఆనంద్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

జిల్లా వ్యవసాయాధికారి ఉష



యూరియా కొనుగోళ్లను పరిశీలిస్తున్న డీఏఓ ఉష

ఇబ్రహీంపట్నం రూరల్: రైతులకు అవసరమైన యూరియా ప్రభుత్వం సరఫరా చేస్తోందని జిల్లా వ్యవసాయాధికారి ఉష తెలిపారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని ఎంపీపటేల్‌గూడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో యూరియా నిల్వలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రైతులతో మాట్లాడారు. యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అధిక మొత్తంలో బస్తాలు కొని నిల్వ చేసుకోవద్దని సూచించారు. అనంతరం ఎంపీ పటేల్‌గూడలోని మెట్టు అశోక్‌రెడ్డి పండిస్తున్న వరి మేలు కేఎన్ఎం 1638 రకం పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ మహేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాత, ఏఓ విద్యాధరి, ఏఈఓ శ్రవణ్‌కుమార్, సహకార సంఘం సీఈఓ మాధవి, మాజీ చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పదవులకు అప్పు ముప్పు!

సంఘం ఆర్థిక బలోపేతానికి పాటుపడాల్సిన పలువురు పీఏసీఎస్ డైరెక్టర్లు పదవీ పలుకుబడితో రూ.లక్షల్లో రుణాలు పొందారు. గడువులోగా చెల్లించకపోగా డిఫాల్టర్లుగా మారారు. ఏళ్లుగా బకాయిలు చెల్లించడమే మానేశారు. దీనిపై సర్కార్ సీరియస్ కావడంతో శాఖాపరమైన చర్యలకు డీసీసీబీ ఉన్నతాధికారులు సన్నద్ధం అవుతున్నారు.

- పీఏసీఎస్‌ల్లో వ్యక్తిగత రుణాలు పొందిన డైరెక్టర్లు
- అప్పు బకాయిలపై సర్కార్ సీరియస్
- రుణగ్రహీతలపై దృష్టి సారించిన ఉన్నతాధికారులు
- త్వరలో నోటీసుల జారీకి రంగం సిద్ధం
- అవసరమైతే పదవి నుంచి తొలగించి, ఆస్తుల జప్తునకు సన్నద్ధం
- వసూలు చేయని కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు



జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయం

యాచారం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో డైరెక్టర్లుగా ఉన్నవారు నిబంధనల ప్రకారం రైతుల మాదిరిగానే రుణాలు పొందే అవకాశం ఉంటుంది. పీఏసీఎస్‌ల్లో పొందిన వ్యక్తిగత రుణాలను ప్రతి మూడు నెలలకోసారి, స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను ప్రతి ఆరు నెలలకోసారి చెల్లించాల్సి ఉంటుంది. కానీ అప్పు తీసుకున్నవారంతా పదవీ పలుకుబడితో ఏళ్లగా బకాయి చెల్లించకుండా మొండికేశారు. ఈ క్రమంలో సర్కార్ ఆదేశాల మేరకు తాజాగా జిల్లాలోని 37 పీఏసీఎస్‌ల్లో తొమ్మిది చైర్మన్ల పవర్ కట్ చేసిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. మూడేళ్లకు మించి బకాయి చెల్లించని వారిని పదవిలోంచి తప్పించే విధంగా దృష్టి సారించారు. అప్పులు వసూలు చేయని పీఏసీఎస్‌ల కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధం అవుతున్నారు.

అప్పుల వివరాలు సేకరణ

జిల్లాలోని 37 పీఏసీఎస్‌ల్లో ప్రతి పీఏసీఎస్‌కు 13 మంది డైరెక్టర్ల (వీరిలో ఒకరు చైర్మన్‌గా ఉంటారు) చొప్పున మొత్తంగా 481 మంది ఉన్నారు. వీరంతా 2020 ఫిబ్రవరి 15న ఎన్నికయ్యారు. ఏ పీఏసీఎస్‌లో ఏ డైరెక్టర్ ఎంత రుణం పొందారు.. వ్యక్తిగత రుణాలా.. లేక పంట రుణాలా.. బినామీల పేర్లపై పొందారా.. అనే వివరాల నివేదికను అందజేయాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు కార్యదర్శులను ఆదేశించారు. ఆరు నెలల క్రితమే ఆన్‌లైన్ ద్వారా మొండి బకాయిదారుల వివరాలు ప్రాథమికంగా సేకరించారు. తాజాగా పూర్తి స్థాయిలో రుణాలు పొందిన వివరాలు, అప్పు మొత్తం, వడ్డీ బకాయి, వసూలు కోసం చట్టపరంగా తీసుకున్న నిర్ణయాలపై వివరాలు అడిగినట్లు తెలిసింది.

పదవీ పలుకుబడితో..

పీఏసీఎస్‌ల్లో రుణాలు పొందిన డైరెక్టర్లు పదవీ పలుకుబడితో బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సమాచారం. కార్యదర్శులు బకాయిల కోసం ఒత్తిళ్లు తెచ్చినా చైర్మన్ల ద్వారా నోళ్లు మూయించేవారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతి పీఏసీఎస్‌లో పది మందికి పైగా వ్యక్తిగత, బంగారు, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు పొందారు. 350 మందికి పైగా రూ.కోట్లాది రుణాలు పొందినట్లు తెలిసింది. ప్రతి పీఏసీఎస్‌లో నలుగురైదుగురు డైరెక్టర్లు డిఫాల్టర్లుగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే వీరిని గుర్తించిన ఉన్నతాధికారులు త్వరలో నోటీసులు జారీ చేయనున్నారు. అయినా సకాలంలో అప్పు మొత్తం చెల్లించని పక్షంలో పదవుల నుంచి దించేసి, తాకట్టు పెట్టిన ఆస్తుల జప్తునకు రంగం సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఆదర్శంగా ఉండాలి



పీఏసీఎస్‌ల్లోని డైరెక్టర్లు తీసుకున్న అప్పులు సకాలంలో చెల్లించి, మిగతా రైతులకు ఆదర్శంగా ఉండాలి. అప్పు బకాయిలపై సర్కార్ సీరియస్‌గా ఉంది. ఇప్పటికైనా తీసుకున్న మొత్తం త్వరగా చెల్లించాలి. లేదంటే పదవీ గండంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.
– కొత్తకుర్మ సత్తయ్య, డీసీసీబీ చైర్మన్

బీహార్ ఎన్నికల కోసమే జీఎస్టీ తగ్గింపు

మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ఇబ్రహీంపట్నం: బీహార్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని.. ప్రజలపై మమకారంతో కాదని మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం జాతీయ నాయకుడు నర్సిరెడ్డి విమర్శించారు. సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మనుధర్మ శాస్త్రం అమలుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం దోపిడీ వర్గాలకు కొమ్ముకాస్తోందన్నారు. ఇందుకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. సీతారాం ఏచూరి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి అట్టడుగువర్గాలకోసం పని చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, కార్యదర్శి వర్గ సభ్యులు సామేల్, నర్సింహ, జగన్, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రావుల జంగయ్య, అంజయ్య, నర్సింహ, సీహెచ్ జంగయ్య, సీహెచ్ బుగ్గ రాములు, పి.జగన్, ఎల్లేశ్, పురుషోత్తం, వెంకటేశ్, రాజు, విఘ్నేశ్, శారద, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్‌లో నీళ్లు.. ఆగమైన వాహనాలు



ఇబ్రహీంపట్నం: పెట్రోల్‌తో పాటు నీళ్లు రావడంతో ఓ కారు మొరాయించి ఇంజన్ పాడయింది. ఈ ఘటన ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. శేరిగూడ శ్రీ ఇందు ఇంజినీరింగ్ కళాశాల ఎదుట ఉన్న హెచ్‌పీ బంక్‌లో మహేశ్ తన కారులో పెట్రోల్ పోయించాడు. శుక్రవారం కారు మొరాయించడంతో మెకానిక్ వాహనాన్ని పరిశీలించి ఇంజన్ పాడయిందని తెలిపాడు. దీంతో మహేశ్ బంక్‌కు వచ్చి పరిశీలించగా పెట్రోల్‌తోపాటు నీరు వచ్చింది. దీంతో బంక్ సిబ్బందికి, అక్కడకు వచ్చినవారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గతంలోనూ ఇదే బంక్‌లో నీళ్లు వస్తున్నాయని ఫిర్యాదులు వచ్చినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని వినియోగదారులు ఆరోపించారు.

చర్యలు తీసుకుంటాం

వర్షాలు కురవడం.. పెట్రోల్ నిల్వ ఉండే ట్యాంకులు నాణ్యత లోపించడం తదితర కారణాలతో నీరు చేరే అవకాశం ఉంటుంది. సరిచేసుకోవాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉంటుంది. వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలను అందించకుంటే చర్యలు తప్పవు. వర్షకాలంలో నాజిల్‌ను పైకెత్తి వాహనాలకు పెట్రోల్ పోయించుకుంటే అందులో ఫ్యూయల్ వస్తుందా, నీరు వస్తుందా గమనించవచ్చు.

– మాచన రఘునందన్, పౌరసరాఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

మూసీలోకి పోటెత్తిన వరద



ఔటర్ సబ్ రోడ్డుపై భారీగా ప్రవహిస్తున్న వరద

సాక్షి, సిటీబ్యూరో/బండ్లగూడ: మూసీ నదిలో భారీగా వరద ప్రవాహం పెరిగింది. జంట జలాశయాల గేట్లు నాలుగు అడుగుల చొప్పున ఎత్తి దిగువ భాగాన భారీగా జలాలు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు నిండుకుండల్లా మారగా, ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద వచ్చి చేరుతోంది. శుక్రవారం తెల్లవారు జామున నుంచి భారీగా వరద ప్రవాహం పెరిగింది. రెండు జలాశయాలాకు 2,300 క్యూసెక్కుల నుంచి 5,500 క్యూసెక్కుల వరకు వరద వచ్చి చేరుతుండటంతో గేట్లు ఎత్తి అదే స్థాయిలో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మూసీలో వరద ప్రవాహం పెరగడంతో పరీవాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. నివాసాలు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. హిమాయత్‌సాగర్ నుంచి రాజేంద్రనగర్ వెళ్లే ఔటర్ సబ్ రోడ్డుపై వరద భారీగా ప్రవహిస్తుండటంతో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా రాకపోకలు నిలిపివేశారు. ఉస్మాన్‌సాగర్ జలాశయం 6 క్రస్ట్ గేట్లు ఎత్తడంతో మంచిరేవుల నుంచి నార్సింగి వెళ్లే దారిపై వరదనీరు రావడంతో ఆ రోడ్డుపై కూడా రాకపోకలు నిలిపివేశారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

మొయినాబాద్: భర్తతో గొడవ పడి ఒంటికి నిప్పంటించుకున్న మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని సురంగల్‌కు చెందిన అనిల్‌కుమార్, కృష్ణవేణి(28) భార్యాభర్తలు. వీరిద్దరూ తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో ఈ నెల 9న రాత్రి మరోమారు గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన కృష్ణవేణి ఒంటిపై కరెంటు ఆయిల్ పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన స్థానికులు మంటలార్పి ఆస్పత్రికి తరలించారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి ఓ కూతురు ఉంది. కేసు దర్యాప్తులో ఉంది.

నిందితుడికి రిమాండ్

కొందుర్గు: భార్యను హతమార్చిన కేసులో పోలీసులు శుక్రవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని రేగడి చిల్కమర్రి గ్రామానికి చెందిన కోవూరి జయమ్మ(50) వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో భర్త వెంకట్ రెడ్డి హత్య చేసినట్లు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా మృతురాలి భర్త వెంకట్‌రెడ్డిని నిందితుడిగా గుర్తించారు. ఈ మేరకు ఆయన్ను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఒకే రోజు 97 మందికి పదోన్నతులు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు, వారితో సమాన స్థాయి హోదా ఉన్న 97 మందికి సూపరింటెండెంట్‌లుగా పదోన్నతులు కల్పిస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం మేరకు తాత్కాలిక పదోన్నతి కల్పించినట్లు పేర్కొన్నారు.

దసరాకు ముందే వేతనాలు ఇవ్వండి

లక్డీకాపూల్ : దసరా పండుగకు ముందుగానే మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు (ఎఐటియుసి) డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఏఐటీయూసీ ప్రతినిధులు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ నెల 26వ తారీఖు లోపు మున్సిపల్ కార్మికులందరికీ వేతనాలు చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం తదితరులు కోరారు.

రూ.282 కోట్లతో గండిపేట డీపీఆర్

- 27 ఎంజీడీ నీటి తరలింపునకు మరో పైపులైన్
- త్వరలో ప్రభుత్వానికి జలమండలి నివేదిక



గండిపేట జలాశయం

సాక్షి, సిటీబ్యూరో: వందేళ్లకు పైగా నగర దాహార్తి తీర్చుతున్న గండిపేట (ఉస్మాన్ సాగర్) నుంచి మరో పైపులైన్ నిర్మాణం కోసం సుమారు రూ.రూ.282 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించి ప్రభుత్వానికి సమర్పించేందుకు జలమండలి సిద్ధమైంది. నగరం నలు దిక్కులా విస్తరిస్తుండటంతో తాగునీటి అవసరాలు మరింత పెరిగిపోతున్నాయి. ఇప్పటికే జంట జలాశయాలతో పాటు కృష్ణా, గోదావరి, మంజీరా, సింగూర్ ప్రాజెక్టులను నీటిని తరలిస్తున్నా.. సరిపోని పరిస్థితి. దీంతో అందుబాటులో ఉన్న జలవనరుల నుంచి మరింత నీటిని నగరానికి తరలించేందుకు జలమండలి ప్రణాళిక రూపొందిస్తోంది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో గండిపేట జలాశయం నుంచి ఆసిఫ్‌నగర్ రిజర్వాయర్ వరకు మరో పైపులైన్ ఏర్పాటుకు సిద్ధమైంది. గండిపేట నుంచి కాండూట్ లైన్ ద్వారా తరలిస్తున్న జలాలు మార్గమధ్యలో లీకేజీల కారణంగా సగానికిపై వృథా అవుతుండటంతో వాటి మరమ్మతులతో పాటు దానికి సమాంతరంగా కింద భాగంలో పైపులైన్ వేసేందుకు కార్యాచరణకు సిద్ధమైంది.

కాలువ పునరుద్ధరణ..

ఉస్మాన్ సాగర్ నుంచి ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్ల వరకు 27 ఎంజీడీ నీటిని తరలించే కాలువను పునరుద్ధరించడం, తరచూ లీకేజీలు, మరమ్మతుల కోసం బ్రేక్‌డౌన్‌ల నివారణ కోసం జలమండలి సిద్ధమైంది. మొత్తంమీద ఉస్మాన్ సాగర్ వద్ద రా వాటర్ ఆర్‌సీసీ సంప్, పంపుహౌస్, 4.0 మీటర్ల ఎత్తు రిటైనింగ్ వాల్, షేక్‌పేటలో నీటిశుద్ధి కేంద్రం, నిర్వాహక భవన నిర్మాణాలు, షేక్‌పేటలో క్లియర్ వాటర్ సంప్ నిర్మాణం, ఆసిఫ్ నగర్ వద్ద 4.0 మీటర్ల ఎత్తు రిటైనింగ్ వాల్ నిర్మాణాలు చేపట్టనున్నారు. ట్రాన్స్‌మిషన్ కింద వద్ద ప్రతిపాదిత సంప్ వరకు 1500 ఎంఎం వ్యాసం కలిగిన గ్రావిటీ మెయిన్ పైపులైన్, ఉస్మాన్ సాగర్ నుంచి షేక్‌పేట వరకు 1300 ఎంఎం వ్యాసం కలిగిన పంపింగ్ మెయిన్ పైపులైన్, షేక్‌పేట్ నుంచి ఆసిఫ్ నగర్ వరకు 800 ఎంఎం డయా కలిగిన షేక్‌పేట్ పంపింగ్ మెయిన్‌లు, పైపులైన్ నిర్మాణాలు చేపట్టనున్నారు.

సగానికిపైగా నీటి వృథా

గండిపేట నుంచి కాండూట్ ద్వారా నగరానికి తరలిస్తున్న నీటిలో సగం నీరు వృథా అవుతోంది. వాస్తవానికి గండిపేట జలాశయం నుంచి సుమారు 26 ఎంజీడీలకుపైగా తాగునీరు తరలించే అవకాశం ఉంది. ప్రస్తుతం నగరానికి ప్రతినిత్యం సుమారు 20 నుంచి 22 ఎంజీడీల నీరు తరలిస్తుండగా కాండూట్‌కు అడుగడుగునా లీకేజీల కారణంగా దాదాపు 8 నుంచి 10 ఎంజీడీలు మాత్రమే వినియోగదారులకు సరఫరా అవుతున్నట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గండిపేట నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్ వరకు సుమారు 14.5 కిలో మీటర్ల పొడువు గల కాండూట్‌కు దాదాపు 45 ప్రాంతాల్లో లీకేజీ సమస్య ఉంది. నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా జర్మన్ టెక్నాలజీతో లీకేజీల మరమ్మతు పనులు నిర్వహించి 1 నుంచి 2 ఎంజీడీల నీటి వృథాను అరికట్టగలిగారు.

డీఆర్ఎఫ్ సిబ్బందికి డిమోషన్

- మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ సభ్యుల తొలగింపు
- మ్యాన్‌హోల్ ఘటన నేపథ్యంలో రంగనాథ్ చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీలోని యాకుత్‌పురా డివిజన్ మౌలాకా చిల్లాలో గురువారం చోటు చేసుకున్న మ్యాన్‌హోల్‌లో చిన్నారి పడిపోయిన ఘటనను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సీరియస్‌గా తీసుకున్నారు. దీనిపై లోతుగా విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ప్రాథమిక నివేదిక అందుకున్న ఆయన బాధ్యులపై చర్యలు తీసుకున్నారు. బుధవారం సిల్ట్ తొలగించడానికి తెరచిన మ్యాన్‌హోల్‌ను మూయకపోవడంతోనే గురువారం ఉదయం పాఠశాలకు వెళ్తున్న చిన్నారి అందులో పడిపోయినట్లు గుర్తించారు. ఈ ఘటన జరగడానికి ఇద్దరు డీఆర్ఎఫ్ సూపర్‌వైజర్లు, మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌కు చెందిన ఇద్దరు సిబ్బంది నిర్లక్ష్యం కారణమని తేల్చారు. దీంతో సూపర్‌వైజర్లు ఇద్దరికీ డిమోషన్ ఇవ్వడంతో పాటు మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ సిబ్బందిని తొలగించాలంటూ కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. చిన్నారి మ్యాన్‌హోల్‌లో పడిన ఉదంతానికి పూర్తి బాధ్యత హైడ్రా తీసుకుంటున్నట్లు ప్రకటించిన కమిషనర్ ఏవీ రంగనాథ్ పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శుక్రవారం అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి కీలక ఆదేశాలు జారీ చేశారు. నగరంలో అన్ని మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్లపై మూతలు ఉండేలా చూడాలన్నారు. ఎక్కడైనా లేనట్లు గమనిస్తే సంబంధిత శాఖలైన జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో సంప్రదించి వాటిపై మూతలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోమని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఎక్కడైనా మూతలేని మ్యాన్‌హోల్ కనిపిస్తే 90001 13667 నంబరుకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని రంగనాథ్ కోరారు.

సఫీవుల్లా బాధ్యతల స్వీకరణ

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ ఉర్దూ అకాడమీకి డైరెక్టర్/సెక్రటరీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.షఫీవుల్లా ఉత్తర్వులు జారీ చేశారు. జెన్ కో సంస్థలో డిప్యూటీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ సఫీవుల్లాను తెలంగాణ ఉర్దూ అకాడమీ డైరెక్టర్/సెక్రటరీగా నియమించగా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

డయాలసిస్ పేషంట్ల కోసం ‘ఆశాయే ఇన్’



సాక్షి, సిటీబ్యూరో: డయాలసిస్ సేవలందించే ప్రముఖ సంస్థ నెఫ్రోప్లస్ ఆధ్వర్యంలో నగరంలోని డయాలసిస్ పేషంట్ల కోసం ‘ఆశాయే ఇన్’ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో 250 మందికి పైగా పేషంట్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. డయాలసిస్ పేషంట్ల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే లక్ష్యంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ సహ వ్యవస్థాపకులు కమల్ డి.షా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య నిపుణులు డయాలసిస్ చేయించుకుంటూనే రోజువారీ సాధారణ జీవితం గడిపేందుకు, డయాలసిస్ డైట్‌లో ఉంటూనే ఆహారాన్ని ఆస్వాదించేందుకు, క్షేమంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పేషెంట్లకు వివరించారు.

వేతనాల అవకతవకలపై నివేదిక ఇవ్వండి

సాక్షి ఎఫెక్ట్..

మహేశ్వరం: మహేశ్వరం మోడల్ స్కూల్‌లో స్కావెంజర్ల వేతనాల్లో ప్రిన్సిపాల్ గోపి అవకతవకలకు పాల్పడినట్లు బుధవారం ‘సాక్షి’దినపత్రికలో ‘ఇదేమి ఆదర్శం!’శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన కలెక్టర్ నారాయణరెడ్డి మహేశ్వరం మోడల్ స్కూల్‌లో పని చేసే స్కావెంజర్లకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకానికి ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు మంజూరయ్యాయి? ఎంత మందిని నియమించి ఎంత జీతాలు ఇచ్చారు అనే విషయాలపై పూర్తి నివేదిక అందజేయలని డీఈఓ సుశీందర్‌రావును ఆదేశించారు. జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు ఎంఈఓ కస్నానాయక్ ప్రిన్సిపాల్ గోపి నుంచి వివరాలు సేకరించారు. పూర్తి నివేదికను డీఈఓకు అందజేశారు.

స్కూటీ డిక్కీలోంచి రూ.2.97 లక్షలు చోరీ

శంకర్‌పల్లి: బ్యాంకులో నగదు డిపాజిట్ చే సేందుకు వెళ్లిన ఓ వ్యక్తిని.. క్యూలైన్ కొంపముంచింది. ఈ ఘటన శుక్రవారం శంకర్‌పల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని హనుమాన్ నగర్‌కి చెందిన ప్రమోద్ గౌడ్(25) పట్టణంలో ఓ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం ఆయన తల్లి డ్వాక్రా సంఘానికి సంబంధించిన రూ. 2.97లక్షల డబ్బులను యూనియన్ బ్యాంకులో డిపాజిట్ చేయమని చెప్పింది. మధ్యాహ్నం బ్యాంక్‌కు వెళ్లగా క్యూలైన్ ఎక్కువ ఉంది. దీంతో ల్యాబ్‌లో పనిచేసుకుని వద్దామని నగదును స్కూటీలో పెట్టుకుని వెళ్లాడు. 15నిమిషాల తర్వాత బయటకి వచ్చి చూడగా నగదు మాయమైంది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆర్టీఏ ఆన్‌లైన్స్‌కు రూ.25.50 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏ ప్రత్యేక నంబర్లకు నిర్వహించిన బిడ్డింగ్‌కు అనూహ్యమైన స్పందన లభించింది. శుక్రవారం ఖైరతాబాద్‌లో నిర్వహించిన బిడ్డింగ్‌లో రవాణాశాఖకు రూ.63,77,361 ఆదాయం లభించినట్లు హైదరాబాద్ జేటీసీ రమేష్ తెలిపారు. ‘టీజీ 09జీ 9999’ నెంబర్‌కు హెటిరో డ్రగ్స్ సంస్థ రూ.25,50,200 చెల్లించి నెంబర్ దక్కించుకుంది.‘టీజీ 09హెచ్0009’ నెంబర్ ను ఏఆర్ఎల్ టైర్స్ లిమిటెడ్ సంస్థ రూ.6,50,009 చెల్లించింది.‘టీజీ 09హెచ్001’ నెంబర్‌కు డాక్టర్ రాజేశ్వరి స్కిన్‌అండ్ హెయిర్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.6,25,999 చెల్లించి ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో నెంబర్ దక్కించుకుంది. ‘టీజీ 09హెచ్0006’ నెంబర్‌కు రూ.5,11,666 లభించింది. ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ ఈ నెంబర్‌ను సొంతం చేసుకుంది.

పాకిస్తానీ ఫొటోతో ‘పని’ కానిచ్చారు!

- మాట్రిమోనియల్ ఫ్రాడ్ చేసిన ఇద్దరు కిలేడీలు
- నగరానికి చెందిన వ్యక్తి నుంచి రూ.25 లక్షలు స్వాహా
- బ్యాంకు ఖాతాలు ఇచ్చి సహకరించిన హైదరాబాదీ
- ఇద్దరిని అరెస్టు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: ఇన్‌స్టాగామ్ ఐడీ ‘ఖూబ్‌సూరత్.రిస్తే’లో పాకిస్తాన్‌కు చెందిన యూట్యూబర్, ఇన్‌ఫ్ల్యూయెన్సర్ పర్వా షా ఫొటో పోస్టు చేసి పెళ్లి ప్రతిపాదనలతో నగరవాసిని మోసం చేసి ఇద్దరు బిజాపూర్ కిలేడీలు రూ.25 లక్షలు కాజేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఓ మహిళతో పాటు సహకరించిన హైదరాబాదీని అరెస్టు చేసినట్లు డీసీపీ దార కవిత శుక్రవారం ప్రకటించారు. కర్ణాటకలోని బిజాపూర్‌కు చెందిన అనీసా మహ్మద్యసీన్ హుండేకర్, జోహార్ ఫాతిమా తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం మాట్రిమోనియల్ ఫ్రాడ్స్ చేయాలని పథకం వేశారు. ఈ మేరకు 2023లో ఇన్‌స్టాగామ్‌లో ఖూబ్ సూరత్.రిస్తే పేరుతో ఓ ఐడీ క్రియేట్ చేశారు. ఇందులో పాకిస్తాన్‌కు చెందిన యూట్యూబర్ పర్వా షా ఫొటోలు పోస్టు చేశారు. ఇవి తనవే అన్నట్లు అనీసా తన ఫోన్ నెంబర్ పోస్టు చేసింది. ఆ ఏడాది మార్చిలో ఈ ప్రొఫైల్ చూసిన నగర వాసి సంప్రదించి పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చాడు. వివాహం చేసుకోవడానికి అంగీకరించిన అనీసా అతడితో మాట్లాడింది. ప్రత్యేక యాప్ ద్వారా పర్వా షానే మాట్లాడుతున్నట్లు వీడియో కాల్స్ కూడా చేసింది. ఆపై వైద్యం సహా వివిధ అత్యవసర అవసరాల పేరు చెప్తూ నగరవాసి నుంచి డబ్బు తీసుకోవడం ప్రారంభించింది. ఈ వ్యవహారంలో ఫాతిమా సైతం సహకరించింది. వీరికి పరిచయస్తుడైన హైదరాబాదీ మహ్మద్ అబ్దుల్ అమీర్ కమీషన్ ప్రాతిపదికన తన బ్యాంక్ ఖాతా వివరాలు అందించాడు. ఇందులోనూ బాధితుడు కొంత మొత్తం డిపాజిట్ చేశాడు. ఎట్టకేలకు తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఏసీపీ ఆర్‌జీ శివమారుతి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాదరావు నేతృత్వంలోని బృందం ఈ కేసు దర్యాప్తు చేసింది. అమీర్‌తో పాటు అమీసాను అరెస్టు చేసి వీరి నుంచి ల్యాప్‌టాప్, ట్యాబ్, ఫోన్లు స్వాధీనం చేసుకుంది. పరారీలో ఉన్న ఫాతిమా కోసం గాలిస్తోంది.

ముగ్గురి నుంచి రూ.33 లక్షలు స్వాహా...

డిజిటల్ అరెస్టు సహా మూడు రకాలైన నేరాల్లో ముగ్గురు నగర వాసుల నుంచి సైబర్ నేరగాళ్లు రూ.33 లక్షలు కాజేశారు. ఈ మేరకు శుక్రవారం వేర్వేరు కేసులు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. యాకుత్‌పురకు చెందిన వృద్ధుడికి (75) పోలీసు అధికారుల మాదిరిగా ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు ఆయన ఆధార్ కార్డు దుర్వినియోగమైందని చెప్పారు. ఆపై కొందరు యూనిఫాంలో వీడియో కాల్స్ చేసి ఐపీఎస్ అధికారులుగా మాట్లడిన నేరగాళ్లు నేషనల్ సీక్రెట్స్ యాక్ట్ కింద కేసు నమోదైందని భయపెట్టారు. డిజిటల్ అరెస్టు చేశామని, విషయం ఎవరికీ చెప్పద్దని భయపెడుతూ గత నెల 19 నుంచి ఈ నెల రెండో తేదీ వరకు మొత్తం రూ.21,01,650 కాజేశారు. అబిడ్స్‌కు చెందిన ఓ బాధితుడికి (35) ఆన్‌లైన్‌లో ఉద్యోగం పేరుతో ఎర వేసిన సైబర్ నేరగాళ్లు ఆకర్షణీయ జీతమంటూ ఎర వేశారు. ఆపై గూగుల్ రివ్యూస్ సహా వివిధ టాస్కులు ఇచ్చి, కమీషన్ల పేరుతో వర్చువల్ యాప్‌లో లాభాలు చూపించారు. ఆపై పెట్టుబడులంటూ రూ.10,25,550 డిపాజిట్ చేయించుకున్నారు. యాప్‌లో రూ.15,57,900 లాభం చూపించి... విత్‌డ్రా చేసుకోవాలంటే మరికొంత కట్టాలనడంతో అనుమానం వచ్చిన బాధితుడు ఆరా తీసి తాను మోసపోయానని గుర్తించాడు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన మరో వ్యక్తికి (44) వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో ఎర వేసిన సైబర్ నేరగాళ్లు రూ.1,61,720 కాజేశారు. ఈ ముగ్గురి బాధితుల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఆభరణాల దుకాణంలో చోరీ

బంజారాహిల్స్: సోమాజిగూడలోని ఖజానా జ్యువెలరీ ఆభరణాల షాపులో రూ.1.52 లక్షల విలువ చేసే బంగారు కడియం చోరీకి గురైంది. ఈ మేరకు ఖజానా జ్యువెలరీ మేనేజర్ ఎం.వెంకటరమణ పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 11వ తేదీన ఉదయం ఓ మహిళ బంగారు పంజాబీ కడియం కొనుగోలు చేయడానికి వచ్చి సేల్స్ ఎగ్జిక్యూటివ్ సతీష్‌ను అడిగింది. ఈ మేరకు ఆయన కడియాన్ని బల్లపై ఉంచి చూడమని చెప్పాడు. సేల్స్‌మేన్ కళ్లు గప్పిన కస్టమర్ నకిలీ కడియం అక్కడ పెట్టి బంగారు కడియాన్ని చాకచాక్యంగా జేబులో వేసుకుంది. సీసీ ఫుటేజీ పరిశీలించగా బురఖా ధరించి వచ్చిన ఓ మహిళ 2, 3 ఆభరణాలు వేర్వేరు కౌంటర్‌లో చూసి చివరకు ఈ కడియాన్ని చూపించమంటూ అడిగిందని, అదే సమయంలో నకిలీ కడియాన్ని అక్కడ పెట్టి అసలు కడియాన్ని తస్కరించిందని గుర్తించారు. ఈ మేరకు జ్యువెలరీ షాపు మేనేజర్ వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.